

ప్రజా **రిపబ్లిక్**

ప్రతి అక్షరం ప్రజల కోసం



స్పార్క్ ఎడిషన్

EVENING 6 PM

సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 336 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు 2 + https:www.prajarepublic.com + వెల - 1/- | మంగళవారం 08 జూలై 2025

RNI No: APTEL/2023/87888 | Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole


## ఎయిరిండియా విమాన ప్రమాదం..
# కేంద్రానికి ప్రాథమిక నివేదిక

**దిల్లీ, జూలై 8, (రిపబ్లిక్ న్యూస్):** అహ్మదాబాద్‌లో చోటుచేసుకున్న దిగ్భ్రాంతికర విమాన ప్రమాద ఘటన పై ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో దర్యాప్తు కొనసాగుతోంది. ఈ ప్రమాదంపై ఇప్పటివరకు జరిపిన విశ్లేషణ, దర్యాప్తు ఆధారంగా ఏఏఐబీ ప్రాథమిక నివేదిక రూపొందించింది. దాన్ని మంగళవారం కేంద్ర పౌరవిమాన మంత్రిత్వశాఖతో పాటు సంబంధిత ఇతర అధికారులకు సమర్పించినట్లు ప్రభుత్వ ఉన్నతస్థాయి వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతానికి ఈ నివేదికను అధికారులు బయటపెట్టలేదు. ఈ వారాంతంలో విడుదల చేసే అవకాశమున్నట్లు సదరు వర్గాలు పేర్కొన్నాయి.



విమాన డేటా, చివరి నిమిషంలో సిబ్బంది చర్యలు, వాతావరణ పరిస్థితులు తదితర అంశాలతో ఈ ప్రాథమిక నివేదిక రూపొందించినట్లు తెలుస్తోంది. ఈ నివేదికతో ప్రమాదానికి గల కారణాలపై ఓ కొలిక్కి వచ్చే అవకాశాలు కన్పిస్తున్నాయి. జూన్ 12న ఈ దుర్ఘటన చోటుచేసుకోగా.. ఆ మరుసటిరోజే ప్రమాదంపై దర్యాప్తునకు ఏఏఐబీ ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. దీనికి ఏఏఐబీ డైరెక్టర్ జనరల్ జీవీజీ యుగంధర్ నేతృత్వం వహిస్తుండగా.. ఏవియేషన్ మెడిసిన్, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ నిపుణులు, నేషనల్ ట్రాన్స్పోర్టేషన్ సేఫ్టీ బోర్డు నిపుణులు సభ్యులుగా ఉన్నారు. ప్రమాదానికి గురైన విమానం నుంచి సేకరించిన బ్లాక్ బాక్స్ ను ఏఏఐబీ ల్యాబ్కు తరలించారు. అందులోని డేటాను విజయవంతంగా డౌన్లోడ్ చేసి ప్రమాదానికి గల కారణాలను విశ్లేషిస్తున్నారు. అహ్మదాబాద్ నుంచి జూన్ 12న లండన్ బయలుదేరిన ఎయిరిండియా డ్రీమ్ లైనర్ విమానం.. టేకాఫ్ అయిన కొన్ని క్షణాల్లోనే కుప్పకూలిపోయింది. ఘటన సమయంలో విమానంలో 242 మంది ఉండగా.. ఒకేఒక్క వ్యక్తి మాత్రం ప్రాణాలతో బయటపడ్డారు. మిగతా 241 మంది మృతి చెందారు. ఇక, ఈ విమానం మెడికల్ కాలేజీ హాస్టల్పై పడటంతో అందులోని పలువురు మృతి చెందారు. మొత్తంగా ఈ దుర్ఘటనలో మృతుల సంఖ్య 270 పైనే ఉన్నట్లు గుజరాత్ ప్రభుత్వం వెల్లడించింది.

## పాశమైలారం సిగాచీ పరిశ్రమకు ఎన్డీఎంఏ..
# యాజమాన్యంపై తీవ్ర ఆగ్రహం

**సంగారెడ్డి, జూలై 8, (రిపబ్లిక్ న్యూస్):** పాశమైలారం సిగాచీ పరిశ్రమను నేషనల్ డిజాస్టర్ మేనేజ్మెంట్ అథారిటీ (ఎన్డీఎంఏ) బృందం పరిశీలించింది. అనంతరం అక్కడే సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా నిర్వహణ లోపాలపై సిగాచీ యాజమాన్యంపై ఎన్డీఎంఏ ప్రశ్నలు సంధించింది. యాజమాన్యం సరిగా సమాధానాలు ఇవ్వలేకపోవడంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది.



ఆ సంస్థ అధికారుల స్పందనపై అసంతృప్తి వ్యక్తి చేసిన ఎన్డీఎంఏ బృందం.. రసాయన పరిశ్రమ నిర్వహణ గురించి మొత్తం తమకు తెలుసని, పేలుడు ఎలా సంభవించిందో చెప్పాలని ఘాటుగా వ్యాఖ్యానించింది. సమావేశం అనంతరం పరిశ్రమ యాజమాన్యం నిర్లక్ష్యమే ఈ ప్రమాదానికి కారణమని ప్రాథమికంగా అంచనా వేసింది. సిగాచీ పరిశ్రమలో జరిగిన ప్రమాద ఘటనలో ఇప్పటి వరకు 44 మంది మృతిచెందిన విషయం తెలిసిందే.

# మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్ రెడ్డి
## వ్యాఖ్యలను జగన్ సమర్థిస్తారా?:ఏపీ మంత్రులు

**అమరావతి, జూలై 8, (రిపబ్లిక్ న్యూస్):** కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిపై వైకాపా నేత, మాజీ ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్రెడ్డి చేసిన నీచమైన వ్యాఖ్యలపై ఏపీ మంత్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళల పట్ల వైకాపా నేతలకు ఎలాంటి అభిప్రాయం ఉందో దీంతో మరోసారి బయటపడిందన్నారు.

మహిళలను వైకాపా అగౌరవ పరుస్తోందని మంత్రి వంగలపూడి అనిత అన్నారు. మహిళా ఎమ్మెల్యేను ఉద్దేశించి వైకాపా మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్రెడ్డి నీచంగా మాట్లాడటం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. విజయనగరం జిల్లా బొబ్బిలిలో ఆమె మాట్లాడారు. “ఇటీవల వైకాపా నేత సజ్జల రామకృష్ణారెడ్డితో పాటు సాక్షి ఛానల్లో అమరావతి ప్రాంత మహిళలను ఉద్దేశించి అభ్యంతర వ్యాఖ్యలు చేశారు. దీంతో మహిళా లోకం తిరగబడింది. ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిపై చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ప్రసన్నకుమార్రెడ్డిని వైకాపా నుంచి సస్పెండ్ చేయాలి. దమ్ముంటే మహిళా ఎమ్మెల్యేను ఎదుర్కోండి. జగన్కు రాజకీయం ముఖ్యమా? విలువలు ముఖ్యమా? గంజాయి బ్యాచ్ను ఆయన పరామర్శిస్తున్నారు. గతంలో అనంతబాబు పైనా కూడా చర్యలు తీసుకోలేదు. ప్రసన్నకుమార్ రెడ్డి వ్యాఖ్యలను సమర్థిస్తారా?” అని అనిత నిలదీశారు.

**వైకాపా అధ్యక్షుడి బాటలోనే మిగిలిన నేతలు**

మహిళ అని కూడా చూడకుండా వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిపై ప్రసన్నకుమార్రెడ్డి దారుణంగా మాట్లాడారని.. నీచమైన వ్యాఖ్యలు చేశారని మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. “గతంలో వైకాపా అధ్యక్షుడు సొంత చెల్లిపైనే నోరుపారేసుకున్నారు. ఆ పార్టీ అధ్యక్షుడి బాటలోనే మిగిలిన నాయకులు ప్రవర్తిస్తున్నారు. వైకాపా నేతల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి” అని నారాయణ పేర్కొన్నారు. మరో మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి మాట్లాడుతూ ప్రసన్నకుమారెడ్డి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. సభ్యసమాజం సిగ్గుతో తలదించుకునేలా ప్రసన్నకుమార్ రెడ్డి మాట్లాడారన్నారు. మహిళలకు చేతులెత్తి మొక్కే సంస్కృతి మనదని చెప్పారు. వైకాపా నేతలు మహిళల్ని కించపరుస్తూ ఇష్టానుసారం మాట్లాడటం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పినా వైకాపా నేతలు బూతులు మాట్లాడటం మానలేదన్నారు. ఇలా ఇష్టానుసారంగా మాట్లాడితే సహించేదిలేదని బాలవీరాంజనేయస్వామి హెచ్చరించారు.



# ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిపై నల్లపురెడ్డి వ్యాఖ్యలు
# అభ్యంతరకరం:డిప్యూటీ సీఎం పవన్

**అమరావతి, జూలై 8, (రిపబ్లిక్ న్యూస్):** నెల్లూరు జిల్లా కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డిపై వైకాపా నేత నల్లపురెడ్డి ప్రసన్నకుమార్రెడ్డి చేసిన వ్యాఖ్యలను డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తీవ్రంగా ఖండించారు. మహిళల వ్యక్తిత్వాన్ని అవహేళన చేస్తూ కించపరిచేలా మాట్లాడారని మండిపడ్డారు.



“మహిళలపై అసభ్యకరంగా మాట్లాడటం వైకాపా నేతలకు అలవాటుగా మారింది. ప్రశాంతిరెడ్డిపై ప్రసన్నకుమార్రెడ్డి చేసిన వ్యాఖ్యలు అభ్యంతరకరమైనవి. వ్యక్తిగత జీవితాలను లక్ష్యంగా చేసుకొని వ్యాఖ్యలు చేస్తారా? మహిళలను కించపరచడాన్ని ప్రజాస్వామికవాదులంతా ఖండించాలి. మహిళల గౌరవానికి భంగం కలిగిస్తే చట్టప్రకారం చర్యలుంటాయి. శాసనసభలోనూ ఇలాంటి వ్యాఖ్యలే చేయడంతో ప్రజలు సరైన తీర్పు ఇచ్చారు. మహిళా సమాజం మరోసారి ఆ పార్టీకి తగినవిధంగా సమాధానం చెబుతుంది” అని వ్యాఖ్యానించారు.

# హామీల అమలుపై 18 నెలలుగా
## ప్రభుత్వాన్ని నిలదీస్తున్నాం:కేటీఆర్

**హైదరాబాద్, జూలై 8, (రిపబ్లిక్ న్యూస్):** కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలుపై ఈ ప్రభుత్వాన్ని 18 నెలలుగా నిలదీస్తున్నామని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. తెలంగాణ భవన్ వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. “అభివృద్ధిపై చర్చకు రావాలని సీఎం రేవంత్ రెడ్డిని ఎన్నో సార్లు ఆహ్వానించాం.



అసెంబ్లీలో కాదంటే.. ప్రెస్ క్లబ్లోనైనా చర్చకు రావాలని చెప్పా. రుణమాఫీ, రైతు బోనస్ వంటి అంశాలపై చర్చకు రావాలని ఆహ్వానించా. సీఎం రేవంత్రెడ్డి దిల్లీలో ఉన్నారని తెలిసింది... సీఎం రాకుంటే మంత్రులైనా రావాలి. సీఎం ఇవాళ హాజరుకాకుంటే.. మరో రోజు చర్చకైనా మేం సిద్ధం. సీఎం రేవంత్రెడ్డికి వీలైన తేదీ, ప్రదేశం చెప్పాలని అడుగుతున్నాం. అసెంబ్లీలో మైక్ కట్ చేయకుండా మాట్లాడిస్తామని హామీ ఇస్తే.. అసెంబ్లీలో కూడా సిద్ధం. ఈ ప్రభుత్వం ఒక్క హామీని కూడా నెరవేర్చలేదు. రేవంత్రెడ్డి తప్పుకొంటే.. అభివృద్ధి అంటే ఏంటో కేసీఆర్ చేసి చూపిస్తారు” అని కేటీఆర్ అన్నారు. మీడియాతో మాట్లాడిన తర్వాత పార్టీ నేతలతో కలిసి సోమాజీగూడ ప్రెస్ క్లబ్‌కు బయల్దేరారు.



# మాట తప్పడం సీఎం రేవంత్ రెడ్డికి అలవాటే:కేటీఆర్

**హైదరాబాద్, జూలై 8, (రిపబ్లిక్ న్యూస్):** మాట తప్పడం సీఎం రేవంత్ రెడ్డికి అలవాటేనని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. చర్చ సిద్ధమంటూ ఇటీవల సీఎం రేవంత్ రెడ్డికి సవాల్ విసిరిన కేటీఆర్ ఇవాళ ఉదయం ప్రెస్ క్లబ్ వద్దకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. “కాంగ్రెస్ అరాచక పాలనలో రైతులు ఇబ్బంది పడుతున్నారు. దాదాపు 600 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. ఆరు గ్యారంటీలు, 420 హామీలు అంటూ ప్రజలను మోసం చేశారు. బేసిన్ల నాలెడ్జ్, బేసిక్ నాలెడ్జ్ లేని సీఎం చర్చకు రావాలి. బహిరంగ చర్చకు రేవంత్రెడ్డి సవాలు విసిరితే మేం వచ్చాం. సవాలు విసిరిన సీఎం ఇక్కడకు ఎందుకు రాలేదు? సీఎం రాకపోతే మంత్రులైనా వస్తారని భావించాం. బహిరంగచర్చకు రావాలని సీఎంకు మరోసారి చెబుతున్నాం. కొత్త తేదీ, ప్రదేశం రేవంత్రెడ్డి చెబితే మేం తప్పకుండా వస్తాం. అసెంబ్లీలో చర్చించేందుకు కూడా మేం సిద్ధంగా ఉన్నాం. మైకులు కట్ చేయకుండా.. పూర్తిగా మాట్లాడే అవకాశం ఇస్తే అసెంబ్లీలో కూడా చర్చకు సిద్ధం” అని కేటీఆర్ అన్నారు.

# సముద్రంలో కలిసే నీటిని తెలుగు
# రాష్ట్రాలు వాడుకోవాలి:ఏపీ సీఎం చంద్రబాబు

**శ్రీశైలం, జూలై 8, (రిపబ్లిక్ న్యూస్):** తన జీవితంలో ఇవాళ చాలా సంతోషకరమైన రోజు అని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. జులై తొలివారంలోనే శ్రీశైలం జలాశయం నిండటం శుభపరిణామమని చెప్పారు. కృష్ణమ్మకు జలహారతి ఇచ్చిన అనంతరం ప్రాజెక్టు నాలుగు గేట్లను సీఎం ఎత్తి నీటిని విడుదల చేశారు. ఆ తర్వాత నీటి వినియోగదారులతో నిర్వహించిన సమావేశంలో చంద్రబాబు మాట్లాడారు.




“శ్రీశైల మల్లన్నకు ప్రత్యేక పూజలు చేశా. రాయలసీమ రతనాల సీమ కావాలని ప్రార్థించా. మల్లన్న ఆశీస్సులతో రాయలసీమ సుభిక్షంగా ఉంటుంది. జలాలే మన సంపద.. వాటితోనే రైతుల కష్టాలు తీరతాయి. సాగునీటి ప్రాజెక్టులే ఆధునిక దేవాలయాలు. పైనుంచి వచ్చిన జలాలతో 200 టీఎంసీల నీరు శ్రీశైలం జలాశయంలో ఉంది. రాయలసీమను ఎవరూ కాపాడలేరని గతంలో చాలామంది అన్నారు. సీమ స్థితిగతులు మార్చేందుకు ఎన్టీఆర్ నడుం బిగించారు. రాయలసీమ అభివృద్ధికి నా వంతు కృషి చేస్తున్నా. సాగునీటి ప్రాజెక్టులకు రూ.68 వేల కోట్లు ఖర్చు చేశాం. వైకాపా ప్రభుత్వం అధికారంలో ఉండగా రాయలసీమ ప్రాంతాన్ని పట్టించుకోలేదు. జీడిపల్లికి నీరు తీసుకెళ్లే బాధ్యత మా ప్రభుత్వానిదే. ఈనెల 15 నాటికి ఆ ప్రాంతానికి నీరు రావాలని అధికారులకు టార్గెట్ విధించా. ఈనెల 30 కల్లా కుప్పం, మదనపల్లెకు నీళ్లు తీసుకెళ్తాం. పోతిరెడ్డిపాడు, గాలేరు-నగరి, గండికోట.. అన్నీ మేమే తెచ్చాం. తెలుగుజాతి ప్రపంచంలోనే నంబర్ వన్ కావాలనేది నా లక్ష్యం. మేం చేసిన అభివృద్ధిని హైదరాబాద్లో కొనసాగిస్తున్నారు. సముద్రంలో కలిసే నీటిని తెలుగు రాష్ట్రాలు వాడుకుంటే మంచిది. దీంతో రెండు రాష్ట్రాల రైతాంగానికి మేలు జరుగుతుంది. రాయలసీమకు నీళ్లు వస్తున్నాయంటే పోలవరం వల్లే. సీమకు ఏమేం చేయాలో నా వద్ద బ్లూప్రింట్ ఉంది. దేశంలో ఎక్కడా లేని రోడ్ల వ్యవస్థ ఈ ప్రాంతంలో ఉంది. గతంలో రాగులు, సజ్జలు, జొన్నలు, కొర్రలు తినేవాళ్లం. పాలిష్డ్ రైస్ తిని చాలామంది షుగర్ వ్యాధి తెచ్చుకుంటున్నారు. ఇప్పుడంతా ఆరోగ్యంపై దృష్టి పెడుతున్నారు.. చిరుధాన్యాలు తింటున్నారు. కూరగాయలు, పండ్ల వినియోగం క్రమంగా పెరుగుతోంది. అన్ని రకాల పండ్లు పండే ప్రాంతం రాయలసీమ. కొప్పర్తి, ఓర్వకల్లు.. పారిశ్రామిక హబ్ లుగా మారుతున్నాయి అని చంద్రబాబు అన్నారు.

# శ్రీశైలంలో సీఎం చంద్రబాబు పర్యటన.. 4 గేట్లు ఎత్తి నీటి విడుదల










**శ్రీశైలం, జూలై 8, (రిపబ్లిక్ న్యూస్):** ఏపీ సీఎం చంద్రబాబు శ్రీశైలం ప్రాజెక్టును పరిశీలించారు. తొలుత ప్రాజెక్టు వద్ద ఫొటో ఎగ్జిబిషన్ను పరిశీలించిన సీఎం.. కృష్ణమ్మకు జలహారతి ఇచ్చారు. ఆ తర్వాత రైతులతో కలిసి శ్రీశైలం ప్రాజెక్టులోని 6, 7, 8, 11 నంబర్ గేట్లు ఎత్తారు. దీంతో కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది. అంతకుముందు సీఎం.. శ్రీశైల మహాక్షేత్రాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. సీఎం వెంట మంత్రులు నిమ్మల రామానాయుడు, బీసీ జనార్దన్ రెడ్డి, ఎంపీ బైరెడ్డి శబరి, ఎమ్మెల్యేలు భూమా అఖిలప్రియ, బుడ్డా రాజశేఖర్ రెడ్డి తదితరులు ఉన్నారు.



printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

# వైరలవుతోన్న 'హరి హర వీరమల్లు రన్‌టైమ్..



పవన్ కల్యాణ్ కథానాయకుడిగా రూపొందిన హిస్టారికల్ యాక్షన్ ఫిల్మ్ 'హరి హర వీరమల్లు'. జ్యోతికృష్ణ, క్రిష్ జాగర్లమూడి దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం జులై 24న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకురానుంది. ఇప్పటికే ఓవర్సీస్లో కొన్ని ప్రాంతాల్లో టికెట్ బుకింగ్స్ కూడా ప్రారంభమయ్యాయి. తాజాగా అక్కడ ఓ టికెట్ బుకింగ్ ప్లాట్ఫామ్ దీని రన్టైమ్ 2.40 గంటలుగా పేర్కొంది. దీంతో ఈ రన్టైమ్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీనిపై అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు. ఇక ఈ సినిమాలో పవన్ సరసన నిధి అగర్వాల్ కనిపించనున్న విషయం తెలిసిందే. తాజాగా ఆమె అభిమానులతో చిట్ చాట్ చేస్తూ.. ఈ సినిమాలో ఏ సన్నివేశం ఎక్కువ ఆసక్తికరంగా ఉంటుందో చెప్పారు. ఇంటర్వెల్, పోస్ట్ ఇంటర్వెల్, క్లైమాక్స్‌ని సన్నివేశాలు మరింత ఆసక్తిగా ఉంటాయని వెల్లడించారు. దీని విడుదల కోసం ఎదురుచూస్తున్నట్లు తెలిపారు. 'హరి హర వీరమల్లు' తనకు దేవుడిచ్చిన బహుమానమని అన్నారు. మెగా సూర్య ప్రొడక్షన్స్ పతాకంపై ఏఎం రత్నం నిర్మించిన ఈ చిత్రంలో వీరమల్లు అనే పోరాటయోధుడి పాత్రలో పవన్ కనిపించనున్నారు. ఈ మూవీ రెండు భాగాలుగా రానుంది. ధర్మం కోసం యుద్ధం అంటూ 'హరి హర వీరమల్లు: స్వోర్డ్ అండ్ స్పిరిట్' పేరుతో మొదటి భాగం సిద్ధమైంది. ఇటీవల విడుదలైన దీని ట్రైలర్కు మంచి స్పందన వచ్చింది.

# వివాదాస్పదమైన 'ది' ట్యాగ్ పై స్పందించిన విజయ్ దేవరకొండ..



తన అభిమానులతో ఎప్పుడూ టచ్లో ఉండే హీరోల్లో విజయ్ దేవరకొండ ఒకరు. తన సినిమాల విడుదల సమయాల్లోనే కాకుండా ఎప్పుడూ సోషల్ మీడియా వేదికగా యాక్టివ్గా ఉంటారు. గతంలో ఆయన తన పేరుకు ముందు 'ది' అనే ట్యాగ్ను జోడించగా అది వివాదాస్పదంగా మారిన విషయం తెలిసిందే. దీంతో ఆయన దాన్ని తొలగించాలని అభిమానులకు సూచించారు. తాజాగా దీనిపై విజయ్ మాట్లాడారు. "నా పేరుకు ముందు 'ది' అనే ట్యాగ్ను జోడించడం వల్ల విపరీతమైన స్పందన వచ్చింది. ఆసక్తికరమైన విషయం ఏంటంటే.. దీనివల్ల ఇతర హీరోలెవరూ ఎదుర్కోనన్ని ఎదురుదెబ్బలు నాకు తగిలాయి. యూనివర్సల్ స్టార్ నుంచి పీపుల్స్ స్టార్ వరకు ఎన్నో ట్యాగ్స్ ఉన్నాయి. నాకంటే చిన్నవారు, పెద్దవారు వీటిని ఉపయోగించుకుంటున్నారు. నాకంటే ముందు ఇండస్ట్రీకి వచ్చిన వారికి కూడా ట్యాగ్ లైన్స్ ఉన్నాయి. బహుశా ఏ ట్యాగ్ లేకుండా ఉన్న హీరో నేను ఒక్కడినేనేమో". "నాకు ట్యాగ్లన్తో గుర్తుండాలనే ఆసక్తి లేదు. ప్రేక్షకులు నన్ను నా నటనతో గుర్తుంచుకోవాలని కోరుకుంటాను. ఆడియన్స్ నన్ను సదరన్ సెన్సేషన్, రౌడీ స్టార్.. ఇలాంటి పేర్లతో పిలిచారు. వాటిని నేను అంగీకరించకపోవడంతో నా 'లైగర్' ప్రచారంలో టీమ్ 'ది' అనే పదాన్ని జోడించింది. అప్పటివరకూ ఈ ట్యాగ్ ఎవరికీ లేకపోవడంతో నేను అంగీకరించాను. కానీ, దానివల్ల విమర్శలు ఎదుర్కోవాల్సి వచ్చింది. దీంతో దాన్ని తీసేయాలని నా టీమ్కు సూచించాను" అని తెలిపారు. తనను విజయ్ దేవరకొండ అని మాత్రమే పిలవాలని చెప్పాను. ఇక తన వ్యక్తిగత



# సోషల్ మీడియాకు బ్రేక్.. శ్రుతి హాసన్ పోస్ట్



ఎప్పుడూ సోషల్ మీడియాలో యాక్టివ్గా ఉంటూ అభిమానులతో చిట్చాట్ చేస్తుంటారు నటి శ్రుతి హాసన్. తన సినిమా విశేషాలతో పాటు వ్యక్తిగత విషయాలను కూడా పంచుకుంటుంటారు. తాజాగా ఆమె పెట్టిన పోస్ట్ చర్చనీయాంశంగా మారింది. తాను కొన్ని రోజులు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్లు శ్రుతి హాసన్ తెలిపారు. సోమవారం ఇన్స్టాలో తన ఫాలోవర్స్ను ఉద్దేశించి ఓ పోస్ట్ చేశారు. కొన్ని రోజులు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలనుకుంటున్నట్లు తెలిపారు. నిశ్శబ్దాన్ని ఆస్వాదించాలనుకుంటున్నట్లు చెప్పారు. ప్రస్తుతం శ్రుతి హాసన్ 'కూలీ'లో నటిస్తున్నారు. కథానాయకుడు రజనీకాంత్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రమిది. యాక్షన్ థ్రిల్లర్ నేపథ్యంలో లోకేశ్ కనగరాజ్ తెరకెక్కించారు. కథానాయకుడు నాగార్జున, ఉపేంద్ర, ఆమిర్ ఖాన్, సత్యరాజ్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. అన్నీ పనులు పూర్తి చేసుకున్న ఈ చిత్రం ఆగస్టు 14న ప్రేక్షకుల ముందుకు రానుంది.

ప్రజా రిపబ్లిక్ దినపత్రిక
9948814188,
9985876888
ప్రకటన
ప్రజా సమస్యల పై అనునిత్యం ప్రజా గళాన్ని అక్షర సత్యాలతో కూడిన సంచలన వరుస కథనాలను అందిస్తూ దూసుకెళ్తున్న ప్రజా రిపబ్లిక్ దినపత్రికకు రెండు తెలుగు రాష్ట్రాలలో తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ జిల్లాలలో, నియోజకవర్గాలలో స్టాఫ్ రిపోర్టర్లు, పాత్రికేయులు, మండలాల నందు పాత్రికేయులు కావలెను. ప్రజల పక్షాన నిలుస్తూ సమస్యల పరిష్కారానికి అక్షర పోరాటం చేయడానికి మాతో కలిసి పని చేసేందుకు ఆసక్తి గల అభ్యర్థులు కర్నూలు మరియు నంద్యాలలోని మా కార్యాలయముల నందు లేదా ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.
ప్రజా రిపబ్లిక్ దినపత్రిక కార్యాలయం, షాప్ నెం: 26, మొదటి అంతస్తు, శ్రీనివాస కాంప్లెక్స్, శ్రీనిధి టిఫిన్ సెంటర్ ఎదురుగా, నంద్యాల - 518501
డోర్ నెం:46/181/బి-1, మనోజ్ టాలెంట్ స్కూల్ దగ్గర, బుధవార పేట, కర్నూలు - 518001
బొజ్జ నాగేంద్ర
ఎడిటర్ & మేనేజింగ్ డైరెక్టర్

## చరిత్రలో నేటి ప్రత్యేకత

- 1497: వాస్కోడగామా తొలిసారి నేరుగా భారతదేశంనకు నౌకాయానం ప్రారంభించిన రోజు.
- 1898: ఉమ్మడి మద్రాసు రాష్ట్ర ముఖ్యమంత్రిగా పనిచేసిన కుమారస్వామి రాజా జననం (మ.1957).
- 1914: పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి జ్యోతిబసు జననం (మ.2010).
- 1921: భారత పారిశ్రామిక వేత్త ముళ్ళపూడి హరిశ్చంద్ర ప్రసాద్ జననం (మ.2011).
- 1949: ఆంధ్ర ప్రదేశ్ 16వ ముఖ్యమంత్రి, కాంగ్రెసు పార్టీ నాయకుడు వై.యస్. రాజశేఖరరెడ్డి జననం (మ.2009).
- 1969: భారతీయ నటి, నృత్యకారిణి, సంగీత దర్శకురాలు సుకన్య జననం. (చిత్రంలో)
- 1972: భారత క్రికెట్ క్రీడాకారుడు సౌరవ్ గంగూలీ జననం.
- 1978: తొలితరం తెలుగు భావకవి. భారత స్వాతంత్ర్య సమరయోధుడు నాయని సుబ్బారావు మరణం (జ.1899).
- 2007: భారత దేశపు 11వ ప్రధానమంత్రి చంద్రశేఖర్ మరణం (జ.1927).
- 1919: తెలంగాణ తొలితరం దళిత కవి, మాదిగ మహాయోగి దున్న ఇద్దాసు మరణం (జ.1811).



వాస్కోడగామా



కుమారస్వామి రాజా



జ్యోతిబసు




ముళ్ళపూడి హరిశ్చంద్ర ప్రసాద్



వై.యస్. రాజశేఖరరెడ్డి




సుకన్య



సౌరవ్ గంగూలీ



నాయని సుబ్బారావు



చంద్రశేఖర్



మాదిగ మహాయోగి దున్న ఇద్దాసు



# అతడు.. ఓ అద్భుతం
## :మాజీ క్రికెటర్ శరణ్ దీప్ సింగ్



ఇంగ్లాండ్, టీమ్ ఇండియా మధ్య అయిదు టెస్ట్ మ్యాచ్ల సిరీస్ జరుగుతోంది. ఇందులో భాగంగా ఇప్పటివరకు లీడ్స్‌లోని హెడింగ్లీ వేదికగా మొదటి, బర్మింగ్హామ్లోని ఎడ్జ్బస్టన్ వేదికగా రెండు టెస్ట్ మ్యాచ్లు జరిగాయి. వీటిల్లో ముఖ్యంగా మొదటి మ్యాచ్లో రిషబ్ పంత్ అద్భుతంగా రాణించాడు. అలాగే టీన్ఇండియా తరపున టెస్టుల్లో అత్యధిక సెంచరీలు బాదిన వికెట్ కీపర్ల జాబితాలో ఎంఎస్ ధోనీని కూడా అధిగమించాడు. ధోనీ తన కెరీర్లో సుదీర్ఘ ఫార్మాట్లో 6 సెంచరీలు చేస్తే.. పంత్ ఇప్పటికే 8 శతకాలు నమోదు చేశాడు. హెడింగ్లీ టెస్ట్ మ్యాచ్లో రెండు ఇన్నింగ్స్ లోనూ సెంచరీలు నమోదు చేశాడు. ఈ ఫీట్ సాధించిన రెండో వికెట్ కీపర్గా నిలిచాడు. ఈ నేపథ్యంలో.. టీమ్ ఇండియా మాజీ క్రికెటర్, దిల్లీ ప్రీమియర్ లీగ్ లోని సౌత్ దిల్లీ సూపర్ స్టార్జ్ టీమ్ కోచ్ శరణ్ దీప్ సింగ్, పంత్ను ప్రశంసలతో ముంచెత్తాడు. 'రిషబ్ పంత్ అద్భుత ఆటగాడు. భారత అభిమానులు అతడి నుంచి ఏం కోరుకుంటున్నారో.. అతడు సరిగ్గా అదే చేసి చూపిస్తున్నాడు. అతడు తన సహజసిద్ధమైన ఆట ఆడుతున్నాడు. ఈసందర్భంగా నేను అతడికి ఒకే మాట చెబుతాను.. 'రిషభ్.. నువ్వు ఇలాగే ముందుకుసాగు. నువ్వో అద్భుతమైన, సహజసిద్ధమైన ఆటగాడివి' అని శరణ్ దీప్ సింగ్ అన్నాడు. అలాగే తమ సౌత్ దిల్లీ జట్టు గురించి కూడా అతడు మాట్లాడాడు. 'మేం ఈ వేలంలో దిగ్వేశ్సింగ్ రాఠీని తిరిగి సొంతం చేసుకోగలిగాం. అతడో మ్యాచ్ విన్నర్. గత సీజన్ లోనూ అతడు అద్భుతంగా ఆడాడు. అలాగే ఇటీవల ముగిసిన ఐపీఎల్లోనూ సత్తా చాటాడు. అతడు రోజురోజుకూ మెరుగవుతున్నాడు. ఇటీవల లఖ్ నవూ సూపర్ జెయింట్స్ తరపున చేసిన ప్రదర్శన ఇప్పుడు మా జట్టు తరపున కూడా పునరావృతం చేస్తాడని ఆశిస్తున్నా' అన్నాడు.అలాగే ప్రియాంశ్ ఆర్య గురించి కూడా శరణ్ దీప్ సింగ్ తన అభిప్రాయం వ్యక్తంచేశాడు. 'మేం ఈ వేలంలో దురదృష్టవశాత్తూ ప్రియాంశ్ ఆర్యను సొంతం చేసుకోలేకపోయాం. నిజానికి అతడి స్థానాన్ని ఎవరూ భర్తీ చేయలేరు. అతడు కేవలం టీ20లకే పరిమితం కాకుండా, వన్డేలు, టెస్ట్ మ్యాచ్లు కూడా ఆడాలి' అని శరణ్ దీప్ సింగ్ సూచించాడు.

## అందం

# బీట్‌రూట్‌తో గులాబీ లాంటి అందం మీ సొంతం, ముఖంపై ఒక్క మచ్చ కూడా ఉండకూడదంటే ఎలా వాడాలో తెలుసా?

**బీట్‌రూట్ చర్మానికి ఎంతో మేలు చేస్తుంది. బీట్‌రూట్ సరైన విధానంలో వాడితే మీ ముఖ అందం రెట్టింపు అవుతుంది. చర్మ సౌందర్యం కోసం బీట్‌రూట్ ఎలా వాడాలో తెలుసుకుందాం.**

ఈ రోజుల్లో అమ్మాయి లేదా అబ్బాయి అయినా సరే అందంగా ఉండాలనే కోరుకుంటున్నారు. ఇందుకోసం చాలా రకాలు ప్రయత్నాలు చేస్తుంటారు. చాలా మంది అమ్మాయిలు మార్కెట్ నుంచి అధిక ధరలకు బ్యూటీ ఉత్పత్తులను కొనుగోలు చేస్తారు. కానీ వాటిని వాడటం వల్ల ఎటువంటి ప్రభావం ఉండదు. ఈ రసాయనాలతో నిండిన ప్రొడక్ట్స్ కొన్నిసార్లు చర్మంపై చెడు ప్రభావాన్ని చూపుతాయి. ఇక, ప్రస్తుత కాలంలో జీవనశైలి, చెడు ఆహారపు అలవాట్ల కారణంగా ముఖంపై మచ్చలు, మొటిమలు, పిగ్మెంటేషన్ వంటి సమస్యలతో సఫర్ అవుతున్నారు. అయితే, ఇలాంటి వారికి కొన్ని ఇంటి చిట్కాలు ప్రభావవంతంగా పనిచేస్తాయని నిపుణులు చెబుతున్నారు. మీరు కూడా మచ్చలేని, సహజమైన మెరిసే చర్మాన్ని పొందాలనుకుంటే, బీట్‌రూట్ కంటే మంచి ఎంపిక మరొకటి ఉండదు. బీట్‌రూట్ చర్మాన్ని మెరిపించడానికి సాయపడుతుంది. ఇందులో ఐరన్, విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు, నిర్విషీకరణ లక్షణాలు పుష్కలంగా ఉన్నాయి. ఇవి చర్మం నుంచి విషాన్ని తొలగిస్తాయి. ముఖంపై ఆరోగ్యకరమైన మెరుపును తీసుకురావడంలో సాయపడుతుంది. అలాంటి బీట్‌రూట్ ఎలా వాడాలో ఇప్పుడు తెలుసుకుందాం.





### బీట్‌రూట్ ఫేస్ మాస్క్



మచ్చల్లేని అందం కోసం బీట్‌రూట్ ఫేస్ మాస్క్ మంచి ఆప్షన్. ఇది వేసుకుంటే అందంగా తయారవుతారు. ఇందుకోసం ముందుగా బీట్‌రూట్‌ను ముక్కలుగా కట్ చేసుకోండి. ఆ తర్వాత మిక్సర్‌లో రుబ్బుకోవాలి. దీని తర్వాత, దానికి కొంచెం పెరుగు వేసి మందపాటి పేస్ట్ తయారు చేసుకోండి. ఆ తర్వాత ముఖానికి అప్లై చేసుకోండి. ఇప్పుడు ముఖం మీద ఆరిపోయే వరకు ఉంచండి. ఆ తర్వాత ముఖాన్ని చల్లటి నీటితో కడగాలి. ఇది ముఖం నుంచి మురికిని శుభ్రపరచడమే కాకుండా, చర్మాన్ని మెరుస్తూ కనిపించేలా చేస్తుంది.

### బీట్‌రూట్, తేనె



తేనెలో ఉండే పోషకాలు, యాంటీఆక్సిడెంట్లు, ఇతర గుణాలు చర్మాన్ని ఆరోగ్యంగా, కాంతివంతంగా, మృదువుగా ఉంచడంలో సాయపడతాయి. ఇందుకోసం ముందుగా బీట్‌రూట్ మెత్తని పేస్టులా రుబ్బుకోండి. ఇప్పుడు ఆ మిశ్రమంలో తేనె వేసి మందపాటి పేస్టును తయారు చేసుకోండి. రాత్రి పూట ముఖానికి అప్లై చేయండి. రాత్రంతా అలాగే ఉంచండి. ఆ తర్వాత ఉదయం ముఖాన్ని సాధారణ నీటితో క్లీన్ చేసుకోండి. ఇది చర్మాన్ని మృదువుగా చేయడమే కాకుండా మెరుపును కూడా ఇస్తుంది.

### కలబంద, బీట్‌రూట్



కలబంద కూడా చర్మానికి ఎంతో మేలు చేస్తుంది. ఇది సహజసిద్ధమైన మాయిశ్చరైజర్‌లా పనిచేస్తుంది. చర్మానికి కావాల్సిన తేమను అందిస్తుంది. చర్మ సమస్యల నుంచి ఉపశమనం అందించడంలో తోడ్పడుతుంది. కలబంద, బీట్‌రూట్ రెండూ కలిపి ఉపయోగిస్తే ఆ ప్రయోజనాలు రెట్టింపు అవుతాయి ఇందుకోసం... కలబంద జెల్‌లో బీట్‌రూట్ రసం కలిపి పేస్ట్ తయారు చేయండి. దీని తర్వాత, దానిని ముఖానికి అప్లై చేయండి. కొంత సమయం తర్వాత, ముఖాన్ని నీటితో కడిగి శుభ్రం చేసుకోండి. పొరపాటున కూడా వేడి నీటిని ఉపయోగించవద్దు. వారానికి రెండు నుంచి మూడు సార్లు ఇలా చేస్తే మంచి ఫలితాలుంటాయి.

### బీట్‌రూట్, ముల్తానీ మిట్టీ



ముల్తానీ మిట్టీ కూడా చర్మ ఆరోగ్యానికి ఎంతో మేలు. ఇది జిడ్డు చర్మానికి మంచి ఆప్షన్. ఇందుకోసం 1 టీస్పూన్ బీట్‌రూట్ రసంలో 2 టీస్పూన్ల ముల్తానీ మట్టి కలిపి మెత్తటి పేస్ట్‌గా చేసుకోవాలి. దీన్ని ముఖానికి అప్లై చేసి ఆరిన తర్వాత కడిగేయాలి. ఇది అధిక జిడ్డును పీల్చుకొని చర్మ రంధ్రాలను బిగుతుగా చేస్తుంది. దీంతో, ముఖం కళకళలాడుతుందని నిపుణులు చెబుతున్నారు.

### ముఖ్యమైన చిట్కాలు



- బీట్‌రూట్ రసం తాగడం వల్ల శరీరానికి అవసరమైన పోషకాలు లభిస్తాయి, ఇది లోపలి నుంచి చర్మాన్ని శుభ్రపరచి, మెరుపును అందిస్తుంది.
- ఒక చిన్న బీట్‌రూట్‌ను సగం యాపిల్ లేదా క్యారెట్, చిన్న అల్లం ముక్క, కొద్దిగా నీటితో కలిపి జ్యూస్ చేసుకోండి. దీన్ని వడకట్టి వారానికి 3-4 సార్లు ఉదయాన్నే పరగడుపున తాగడం వల్ల మంచి ఫలితాలు ఉంటాయి.
- చాలా సున్నితమైన చర్మం ఉన్నవారు, బీట్‌రూట్‌ను పూర్తి స్థాయిలో ఉపయోగించే ముందు చిన్న ప్రదేశంలో ప్యాచ్ టెస్ట్ చేసుకోవడం మంచిది.
- ఇలాంటి సహజ చిట్కాలు పాటించేటప్పుడు ఫలితాలు కనిపించడానికి కొంత సమయం పడుతుంది. అందుకోసం క్రమం తప్పకుండా వాడటం మంచిది.

**గమనిక:**

నిపుణులు, అధ్యయనాల ప్రకారం ఈ వివరాలను అందించాం. ఈ కథనం కేవలం మీ అవగాహన కోసమే. అందం, ఆరోగ్యానికి సంబంధించిన ఏ చిన్న సమస్య ఉన్నా వైద్యులను సంప్రదించడమే ఉత్తమ మార్గం. గమనించగలరు.